https://teluguislam.net



# ఖుర్ఆన్ మరియు హదీసులు ఇస్లాం ధర్మానికి మూల ఆధారాలు

ఇస్లాం ధర్మాన్ని అర్థం చేసుకోవడానికి, ఇస్లామీయ ఆదేశాలను అనుసరించడానికి ప్రజలు రెండు మౌలిక అంశాలపై ఆధారపడవలసి ఉంటుంది.

**ఒకటి: ఖుర్ఆన్, రెండవది: ప్రామాణికమైన హదీసులు.**

**ఖుర్ఆన్ గ్రంథం:** దైవవాణి, లేక దైవ సందేశం. అల్లాహ్ తరఫు నుండి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారికి ప్రాసాదింపబడిన గ్రంథం. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

﴿ وَٱلْكِتَٰبِ ٱلْمُبِينِ ﴿٢﴾ إِنَّا جَعَلْنَٰهُ قُرْءَٰنًا عَرَبِيًّا لَّعَلَّكُمْ تَعْقِلُونَ ﴿٣﴾ وَإِنَّهُۥ فِىٓ أُمِّ ٱلْكِتَٰبِ لَدَيْنَا لَعَلِىٌّ حَكِيمٌ ﴿٤﴾ ﴾ الزخرف: ٢ - ٤

**''స్పష్టమైన ఈ గ్రంథం(ఖుర్ఆన్) సాక్షిగా! – నిశ్చయంగా, మీరు అర్థం చేసుకోగలగటానికి, మేము దీనిని అరబ్బీ భాషలో ఖుర్ఆన్‌గా అవతరింపజేశాము. – మరియు నిశ్చయంగా, ఇది మావద్దనున్న మాతృ గ్రంథంలోనిదే! అది మహోన్నతమైనది, వివేకంతో నిండి ఉన్నది.''**

(అజ్ జుఖ్‌రుఫ్:2-4)

**హదీసు అంటే:** ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ప్రవచనాలు, ఆదర్శాలు, ఆయన సూచనలు, ఆయన సహచరుల ఆచరణ, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దృష్టికి వచ్చిన మీదట ఆయన(సల్లల్లాహు అలైహి వ సల్లం) మౌనం వహించిన దృష్టాంతాలన్ని **''హదీస్''** అనబడతాయి. దీనినే' సున్నత్'(ప్రవర్తన) గా కూడా పేర్కొంటారు.

https://teluguislam.net



**హదీసుల(సున్నతుల)ను మనం అల్లాహ్ ఆజ్ఞగానే భావించాలి.**

ఎందుకంటే? ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లం) దైవాదేశానుసారమే మసలుకున్నారు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

﴿ وَمَا يَنطِقُ عَنِ ٱلْهَوَىٰٓ ۝٣ إِنْ هُوَ إِلَّا وَحْيٌ يُوحَىٰ ۝٤ ﴾ **النجم: ٣ - ٤**

**''అతడు తన మనోవాంఛలను అనుసరించి ఏది చెప్పటం లేదు. ఇది అతనిపై అవతరింపజేయబడే ఒక వహీ (దివ్యావిష్కృతి)''**

(సూరతున్ నజ్మ్:3-4).

హదీసులను ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలం నుండే లిఖించడం జరిగింది. మరియు ఎవరికి వారు కంఠస్తం చేసుకుంటు వచ్చారు. ఇలా రెండు మూడు తరాల వరకు జరిగింది. ఆ తరువాత కాలంలో ప్రజలు అనేక విభేదాలకు గురికాబడి వర్గాలుగా ఏర్పడ్డారు. అలాగే ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి నిజమైన సూచనలతో సహా కల్పిత విషయాలు కూడా ధర్మంలో జొప్పించబడ్డాయి. దానిని గమనించిన ఇమాములు మరియు హదీసువేత్తలు హదీసు విద్యపై అపూర్వమైన, అద్వితీయమైన కృషి చేసారు. ఆ తరువాత కల్పిత విషయాలను మరియు నిరాధారమైన హదీసులను తొలిగించి నిజమైన హదీసు గ్రంథాలుగా రచించారు. ఆ గ్రంథాలలో **'సహీహ్ బుఖారీ షరీఫ్,** మరియు **'సహీహ్ ముస్లిం షరీఫ్'** అని ధృడంగా నమ్మవచ్చు. ఒక విధంగా చెప్పాలంటే దివ్యఖుర్ఆన్ తరువాత అతి ప్రామాణికమైన గ్రంథాలు అవి. ఆ తరువాత **'సునన్ అబూదావూద్, సునన్ తిర్మిజీ, సునన్ ఇబ్నుమాజా, సునన్ నసాయియీ, ముఅత్త ఇమామ్ మాలిక్, ముసన్నిఫ్ అబ్దుర్ రజ్జాఖ్, ముస్నదుల్ హుమైది, ముస్నద్ అహ్మద్, ముసన్నఫ్ అబీ షైబా,**

https://teluguislam.net



**సునన్ దారిమి. సహీహ్ ఇబ్ను ఖుజైమా,** ఇలా అనేక హదీసు గ్రంథాలను హదీసు వేత్తలు కూర్పు చేసారు.

హదీసుల ప్రామాణికతను గుర్తించడానికి ఆ మహానీయ హదీసువేత్తలు చరిత్రలో లేని విద్యను సృష్టించారు. అవి ఇల్మె రిజాల్, తబఖాత్, జరహ్, తాదీల్ వంటి గ్రంథాలు. తద్వారా హదీసు ప్రామాణికతను, హదీసు ఉల్లేఖకుని చరిత్రను **(అతను ఎలాంటివాడు, మనసా, వాచా, కర్మణ (త్రీకరణ శుద్ధి) ప్రకారం విశ్వాసనీయుడా కాదా! గుణవంతుడా, గుణహీనుడా అన్న విషయాలు)** తెలుసుకోవడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయి. మరియు హదీసులను ప్రామాణికమైన వ్యక్తుల ద్వారనే సేకరించుటకు సులభతరమైనది. ఈ విధంగా ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లం) వారి ప్రవచనాలలో తప్పుడు వ్యక్తులు, జ్ఞానవిహీనులు తమ ఇష్టానుసారంగా హెచ్చు తగ్గులు చేయకుండా, కల్పితాలకు అవకాశం లేకుండా గట్టి ఏర్పాట్లు చేసారు.

ఇలా జాగ్రత్తలు తీసుకున్న తరువాత కూడా కొన్ని నిరాధారమైన మరియు కల్పిత హదీసులు సమాజంలో ప్రచురించబడుతున్నాయి. వాటిని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదేశాలుగానే ప్రజలు నమ్ముతున్నారు. నిరాధారమైన హదీసులను ఆధారంగా చేసుకొని అనేక మంది ప్రజలు నూతన పోకడలను అనుసరిస్తున్నారు. ఎందుకంటే? సామాన్య ప్రజలు హదీసు ప్రామాణికతను తెలుసుకోవాలంటే కొంత కష్టంగానే మారింది. ఈ కష్టాన్ని గమనించిన కొంతమంది హదీసువేత్తలు ప్రజలకు ప్రామాణికమైన, నిరాధారమైన హదీసులను ఇంకా సులభంగా తెలుసుకొనుటకై వారు ప్రతి హదీసు గ్రంథాన్ని క్షుణంగా పరిశీలించి, వాటికి అంకెల ప్రకారం కూర్పుచేసి

https://teluguislam.net



ప్రామా ణికమైన హదీసులను వేరు చేసారు. అలాగే నిరాధారమైన హదీసులను కూడా వేరు చేసారు. దాని కారణంగా సామాన్య ప్రజలు వాటిని అధ్యాయనం చేసిన వెంటనే ఫలాన హదీసు ఫలాన గ్రంథంలో ఈ నెంబరు హదీసు నిజమైనది లేక ఈ నెంబరు హదీసు నిరాధారమైనదని సులభంగా నిర్ధారణ చేయవచ్చు.

ఇంతటి మహత్తరమైన కృషి చేసిన హదీసువేత్తలలో అనేక మంది ఉన్నారు. వారిలో **'ముహమ్మద్ నాసిరుద్దీన్ అల్బానీ, షుఐబ్ అల్ అర్నవూత్, అబూఇస్హాఖ్ హువైని, సలీం అల్ హిలాలి, ముఖ్బిల్ బిన్ హాది అల్ వాదియి, అహ్మద్ షాకిర్** ప్రముఖుల పేర్లు చెప్పుకోవచ్చును.

నేటి హదీసువేత్తలలో ప్రామణికమైన హదీసులను మరియు నిరాధారమైన హదీసులను వేరు చేయడంలో మహాప్రసిద్ధి పొందిన, అపూర్వమైన, అమూల్యమైన కృషి చేసిన, మహనీయుడు **అల్లామా 'ముహమ్మద్ నాసిరుద్దీన్ అల్బానీ** (రహ్మతుల్లాహి అలైహి) **గారు.**

**ప్రపంచ వ్యాప్తంగా హదీసు జ్ఞానం కలవారిలో ఆయన ప్రముఖులు. మరియు ప్రపంచ ధర్మజ్ఞానులందరూ ఆయన చేసిన కృషిని ఏకగ్రీవంగా అభినందించారు. అంతేకాకుండా వారందరు ప్రామాణికమైన మరియు నిరాధారమైన హదీసుల కొరకు ఆయన గ్రంథాలనే ఆధారంగా తీసుకుంటున్నారు.**